## నంగునూరు, కోహెడ, చిన్నకోడూరు మండలాల్లో కలెక్టర్ పర్యటన

**సిద్దిపేట ఆగస్టు 17 ప్రభాతవార్త :** ఆదివారం జిల్లా కలెక్టర్ కే. హేమావతి నంగునూరు, కోహెడ, చిన్నకోడూరు మండలాల్లో పర్యటించి లో లెవెల్ బ్రిడ్జిలు, గజ్వేల వద్ద వర్షం నీరు ప్రవాహంను ఆర్, బిడి వెంకటేష్ తో కలిసి పరిశీలించారు. ముందుగా నంగునూరు మండలంలోని అక్కినేపల్లి వద్ద మోయతుమ్మెదవాగు పై లెవెల్ బ్రిడ్జిని, బద్దిపడగ వద్ద ఊర చెరువు మత్తడి కింద రోడ్, కోహెడ మండలం గుండారెడ్డిపల్లి వద్ద నక్కవాగు, తంగళ్ళపల్లి వద్ద పిల్లివాగు వాగు, చిన్న కొండూరు మండలం సికింద్లాపూర్, ఇబ్రహింనగర్ నగర్ల వద్దగల స్థానిక వాగుల పై గల లోలెవెల్ గజ్వేలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుతానికి ఆయా వాగులలో సాధారణంగా నీటి ప్రవాహం ఉందని, కానీ కంటిన్యూగా వర్షాలు పడితే లో లెవెల్ బ్రిడ్జిలు, గజ్వేల్ పై నుండి వర్షం నీరు ప్రవహించే అవకాశం ఉన్నందున అధికారులు అప్రమత్తంగా ఉండి అవసరమైనప్పుడు ప్రజలను అప్రమత్తం చేసి ఆయా గజ్వేలు, బ్రిడ్జిలపై రాకపోకలను ఆపివేయాలని ఆర్, బి డి ఇ. వెంకటేష్ కు సూచించారు. జిల్లా కలెక్టర్ పర్యటనలో ఆయా మండలాల స్థానిక అధికారులు, జిల్లా పౌర సంబంధాల అధికారులు పాల్గొన్నారు.



# మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
# వార్త

## గురుకులాల్లో మిగిలి ఉన్న సీట్లకు నేడు స్పాట్ అడ్మిషన్లు

### గిరిజన సంక్షేమ గురుకుల ప్రాంతీయ సమన్వయ అధికారి వెంకన్న

**హుస్నాబాద్ రూరల్, ఆగస్టు 17,ప్రభాతవార్త :**

గురుకుల పాఠశాల, కళాశాలలో మిగిలి ఉన్న సీట్లకు నేడు(సోమవారం) స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు హుస్నాబాద్, అక్కన్నపేట, సిరిసిల్ల, మానాల గురుకుల పాఠ శాల, కళాశాల గిరిజన సంక్షేమ గురుకుల ప్రాంతీయ సమన్వయ అధికారి వెంకన్న ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల విద్యాలయాలలో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించిన బాలికల గురుకుల పాఠశాల,కళాశాలలో 5వ తరగతి నుండి ఇంటర్మీడియ్ ప్రథమ సంవత్సరంలో మిగిలి ఉన్న సీట్లకు నేడు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.ఆసక్తి,అర్హత కలిగిన విద్యార్థులు వరి జనల్ సర్టిఫికెట్లతో పాటు మూడు జిరాక్స్ సెట్లతో ఉదయం 10.గలకు హుస్నాబాద్‌లోని పాఠశాలకు హాజరై పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాల కోసం.9640546 859,9985812801,9032170654 నంబర్లకు సంప్రదించాలన్నారు.



ఎల్లాపూర్ బ్రిడ్జి మంజీర ప్రవాహాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

## లక్ష క్యూసెక్కుల నీరు వచ్చినా ఇబ్బంది లేదు

### మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్

**పాపన్నపేట, ఆగస్టు 17, ప్రభాతవార్త :** సింగూరు నుండి లక్ష క్యూసెక్కుల నీరు వచ్చినా ఇబ్బంది లేదని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్రాజ్ ప్రకటించారు. ఆదివారం సాయంత్రం ఆయన పాపన్నపేట మండలం ఎల్లాపూర్ బ్రిడ్జి వద్ద మంజీర ప్రవాహాన్ని వరిశీలించారు. అనంతరం ఇరిగేషన్ అధికారులతో మాట్లాడారు. ఈ సంధర్బంగా ప్రస్తుతం 50 వేల క్యూసెక్కుల ఫ్లో సింగూరు నుండి వస్తుందని వివరించారు. లక్ష క్యూసెక్కుల వరకు పెరిగినా భయవడాల్సిన అవసరం లేదన్నారు. రైతులకు, జనాలకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా అప్రమత్తంగా ఉండాలని జిల్లాలోని వివిధ శాఖల అధికారులను కలెక్టర్ ఆదేశించారు. వరద ఉధృతికి అనుగుణంగా అధికారులు చర్యలు తీసుకోవాలని చెప్పారు. అధికారులు కంటి మీద కునుకు లేకుండా విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. ఆయన వెంట ఇరిగేషన్, ఇతర శాఖల అధికారులు ఉన్నారు.

**ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలి...**

**టేక్మాల్ ఆగస్టు 17, ప్రభాతవార్త:** భారీ వర్షాల కారణంగా సామాన్య ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులకు ఆదేశించారు. ఆదివారం టేక్మాల్ మండలంలో కలెక్టర్ విస్తృతంగా పర్యటించి పెద్ద చెరువు అలుగు పారి టేక్మాల్ నుండి ధనుర వెళ్లే రోడ్డు పైనే వరద ప్రవాహం గురైన ప్రాంతాన్ని పరిశీలించారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో కురుస్తున్న భారీ వానల నేపథ్యంలో ప్రాజెక్టులు చెరువులు నిండుకుండలా మారాయని ఉధృతంగా ప్రవహిస్తున్నందున ముంపు ప్రాంతాల ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ ప్రజలకు రాకపోకలు ఇబ్బందికాకుండా చూస్తున్నామన్నారు. ప్రమాదకరంగా పొంగి పొర్లుతున్న వాగులు, వంకలు దాటే ప్రయత్నం చేయవద్దని ప్రజలను అప్రమత్తం చేయాలని తెలిపారు. రోడ్లపై నీరు తగ్గేవరకు ప్రజలు బయటకు రాకూడదని, సహాయక చర్యల్లో ప్రజలు అధికారులకు సహకరించాలని కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో టేక్మాల్ తాసిల్దార్ తులసీరామ్, ఆర్ అండ్ బి ఈ సర్దార్ సింగ్, ఈ.ఈ ఇరిగేషన్ శ్రీనివాసులు, సంబంధిత పంచాయతీ సెక్రటరీలు, సంబంధించిన సిబ్బంది తదితరులు న్నారు.

## చిన్నఘనపూర్ ఆనకట్టను సందర్శించిన ఎమ్మెల్యే



చిన్నఘనపూర్ ఆనకట్టను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సునితారెడ్డి

**కొల్చారం, ఆగస్టు 17(ప్రభాతవార్త):** మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు, సింగూర్ ప్రాజెక్టు నుండి నీటిని వదలడంతో కొల్చారం మండల పరిధిలోని చిన్న ఘనపూర్ గ్రామ శివారులోని ఘనపూర్ ఆనకట్ట నిండు కుండలామారి పొంగిపోర్లడంతో ఆదివారం నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి మండల బీఆర్ఎస్ నాయకులతో కలిసి సందర్శించారు. అనంతరం ఆనకట్ట వద్ద గంగమ్మకు ప్రత్యేక పూజలు చేశారు .ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి మాట్లాడుతూ గంగమ్మ దయతో రైతుల పంటలు సుభిక్షంగా పండి ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో అష్టైశ్వర్యాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు రాంపల్లి గౌరీ శంకర్ గుప్త ,యూత్ అధ్యక్షులు సంతోష్ రావు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు ముత్యం గారి సంతోష్ కుమార్ , సూరె గారి నరేందర్‌రెడ్డి, కొముల యాదగౌడ్, చిట్యాల యాదయ్య, చౌరిగారి చిన్న రాములు, నీంగోల చెన్నయ్య, బాగారెడ్డి, సోమ నర్సింలు, వినోద్‌నాయక్, రాజాగౌడ్, లక్ష్మీనారాయణ, మల్లేశం, బీఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పరవళ్లు తొక్కుతున్న మంజీర

### సింగూర్ ఇన్‌ఫ్లో 32,766..అవుట్ ఫ్లో 43,634 క్యూసెక్కులు...

### గంగమ్మ చెరలో దుర్గమ్మ

**పాపన్నపేట, ఆగస్టు 17, ప్రభాతవార్త :** దుర్గమ్మ ఆలయం నాలుగు రోజులుగా గంగమ్మ చెరలోనే కొనసాగుతుంది. ఆదివారం సింగూరు నుండి విడుదల చేసిన నీటి ప్రవాహం పెరగడంతో, మంజీర పరవళ్ళ తొక్కుతు ఘనపురం ఆనకట్ట పైనుండి పొంగుతోంది. ఏడుపాయల్లో జల కళ ఉట్టిపడుతుండటంతో భక్తులు ఆనందం వ్యక్తంచేస్తున్నారు. సింగూరు ప్రాజెక్టులోకి 32,766 క్యూసెక్కులు ఇన్ఫ్లో వస్తుండగా, ఇరిగేషన్ అధికారులు 43,634 క్యూసెక్కుల నీరుగువకు వదులుతున్నారు. సింగూరు ప్రాజెక్టు భద్రతపై డ్యాం సేఫ్టీ కమిటీ ఇచ్చిన సూచనల మేరకు 520.5 మీటర్ల నీటి మట్టాన్ని దృష్టిలో పెటుకొని నీటిని విడుదల చేస్తున్నారు. ఏడుపాయల్లో ఎలాంటి ప్రమాదాలు జరుగకుండా పావన్నపేట ఎస్సై శ్రీనివాస్‌గౌడ్ తన బలగాలతో అనుక్షణం అప్రమత్తంగాపాపన్నపేట ఎస్సై శ్రీనివాస్ గౌడ్ తన బలగాలతో అనుక్షణం అప్రమత్తంగా ఉంటున్నారు. ఎన్డీఆర్ఎఫ్ బృందాలు, గజ ఈతగాళ్లు, రెవిన్యు, ఇరిగేషన్ సిబ్బంది స్థానికంగా ఉంటూ విధులు నిర్వర్తిస్తున్నారు.

**పర్యాటకుల తాకిడి**

ఆదివారం సెలవు దినం కావడంతో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు, రాజగోపురంలోని దుర్గామాత ఉత్సవ విగ్రహాన్ని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.,పొంగి పొర్లుతున్న మనపురం ప్రాజెక్టును చూసి జళకళను ఆస్వాదిస్తు,సాయంత్రం వరకు ఆనందంగా గడిపారు.



ఆలయం ముందు ఉధృతంగా ప్రవహిస్తున్న మంజీర నీరు

# సింగూరు ఆనకట్ట పటిష్టతకు రూ. 16 కోట్లు

- ఖరీఫ్ అనంతరం సిమెంట్ లైనింగ్ పనులు
- గండిపడిన కాలువకు వెంటనే మరమ్మతులు
- వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ



సింగూరు ప్రాజెక్టును కలెక్టర్‌తో కలిసి సందర్శిస్తున్న మంత్రి దామోదర్ రాజనర్సింహ

**పుల్‌కల్, ఆగస్టు 17, ప్రభాతవార్త:** సింగూరు ప్రాజెక్టు భద్రతకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఆనకట్ట పటిష్టతకు 16 కోట్ల రూపాయలను మంజూరు చేశామని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి పి.దామోదర్ రాజనర్సింహ అన్నారు. సంగారెడ్డి జిల్లా పుల్‌కల్ మండలం ఇసోజిపేట గ్రామ శివారులో భారీ వర్షాలకు సింగూరు ఎడమ ప్రధాన కాలువకు పడిన గండిని ఆదివారం మంత్రి దామోదర్ రాజనర్సింహ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, ఎస్‌పి పరితోష్ పంకజ్‌తో కలిసి ప్రాజెక్టును పరిశీలించారు. గండి పడిన ప్రాంతానికి వాహనాలు వెళ్లే పరిస్థితి లేకపోవడంతో మంత్రి ట్రాక్టర్‌లో చేరుకుని అధికారులతో కలిసి పరిశీలించారు. కాలువ మరమ్మతు పనులు యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతం నుంచి 31368 క్యూసెక్కుల వరద వస్తుందని, 43634 క్యూసెక్కుల వరదను 5 గేట్లు ఎత్తి దిగువకు పంపుతున్నారన్నారు. డ్యామ్ సేఫ్టీ కమిటీ సూచనల మేరకు సింగూరు ప్రాజెక్టులో 520.5 మీటర్ల వరకు నీటి నిల్వలు ఉంచేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఖరీఫ్ పంటలు చేతికందగానే సింగూరు కాలువలకు సిమెంట్ లైనింగ్ పనులను ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. రైతుల సమస్యల పరిష్కారమే కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యమని తెలిపారు. ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నందున నీటి పారుదల, రెవెన్యూ అధికారులు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో నీటిపారుదల శాఖ ఎస్ఈ పోచమల్లు, అందోల్-జోగిపేట ఆర్‌డిఓ పాండు, ఈఈ జైభీం, డీఈఈలు నాగరాజు, విక్రం, ఏఈలు మహిపాల్‌రెడ్డి, స్టాలిన్, తహసీల్దార్ కృష్ణ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దుర్గారెడ్డి, నాయకులు రామచంద్రారెడ్డి, లక్ష్మారెడ్డి, గోవర్ధన్, రామకృష్ణారెడ్డి, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.



జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య నుంచి నియామక పత్రం అందుకుంటున్న కౌసిక్‌గౌడ్

## జాతీయ బిసి వెల్ఫేర్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీగా కౌశిక్‌గౌడ్

**గుమ్మడిదల, ఆగస్టు17 ప్రభాతవార్త :** జాతీయ బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ జాయింట్ సెక్రెటరీగా బొంతపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు ఉప్పనూతుల కౌశిక్ గౌడ్ ను జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య నియమాక పత్రాన్ని శనివారం అందజేశారు. ఈ సందర్భంగా కౌశిక్‌గౌడ్ మాట్లాడుతూ బీసీ వెల్ఫేర్ జాతీయ జాయింట్ సెక్రటరీగా ఎంపిక చేసినందుకు ధన్యవాదాలు తెలియజేశారు. బీసీ వర్గాలకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలియజేశారు. బిసి వర్గానికి ఎలాంటి సమస్య ఉన్న తమ దృష్టి తీసుకురావాలని కోరారు. పెద్దల అభిప్రాయం వారి సహకారంతో బిసి వర్గానికి చెందిన నాయకుల సమస్యను జాతీయ నాయకుల దృష్టికి తీసుకెళ్లి సమస్యలను పరిష్కార దిశగా ప్రయత్నం చేస్తానని తెలిపారు.

## ఉన్నత చదువుల కోసం ఆర్థిక సహాయం అందజేసిన మంత్రి

**మునిపల్లి, ఆగస్టు 17(ప్రభాతవార్త):** సంగారెడ్డిజిల్లా, మునిపల్లి మండలం, మల్లికార్జునపల్లి గ్రామానికి చెందిన థ్రెడ్ ఆర్టిస్ట్ డి.జహంగీర్‌కి ఉన్నత చదువుల కోసం మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆర్థిక సహాయం అందజేశారు. ఆదివారం మంత్రి నివాసంలో లక్ష రూపాయలు చెక్కును ఇచ్చారు. పట్టుదలతో చదివి ఉన్నతస్థానానికి ఎదగాలనిఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మల్లికార్జున పల్లి మాజీ ఉప సర్పంచ్ విఠల్ రెడ్డి,ఎఎంసి డైరెక్టర్ మహేష్, మైనారిటీ అధ్యక్షులు ఇస్మాయిల్ పటేల్, గ్రామ శాఖ అధ్యక్షులు డి. వెంకటేశం,కలీం పాషా తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రికి త్రిషమ్మకు వారు ధన్యవాదాలు తెలియజేశారు.



ఆర్థిక సహాయం అందజేస్తున్న మంత్రి దామోదర రాజనర్సింహ



పోలీసులు స్వాధీనం చేసుకున్న ఎండు గంజాయి

## 128 కిలోల ఎండు గంజాయి స్వాధీనం

**సంగారెడ్డి బ్యూరో ఆగస్టు 17 ప్రభాతవార్త :** ఎస్‌న్యాబ్, బిడిఎల్‌భానూర్ పోలీసుల సంయుక్త ఆపరేషన్లో 64 లక్షల విలువగల 128కిలోల నిషేధిత ఎండు గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు సంగారెడ్డి జిల్లా ఎస్పీ కార్యాలయం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. ఆదివారం బిడిఎల్ భానూర్ ఇన్‌స్పెక్టర్ విజయ్‌కృష్ణ, సంగారెడ్డి జిల్లా ఎస్‌న్యాబ్ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వర్‌రావ్ సిబ్బందితో కలిసి పాటి ఎక్స్ శ్రీరోడ్డు వద్ద ఉదయం 11 గంటల సమయంలో వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా హైదరాబాద్ నుండి సంగారెడ్డి జిల్లా ముత్తంగి వైపు సర్వీస్ రోడ్డుపై వస్తున్న తెలుపు రంగుగల స్విఫ్ట్ డిజైర్ కారు, సిల్వర్‌రంగుగల మహీంద్రా బొల్లేరో కారులను ఆపి తనిఖీ నిర్వహించగా 55 ప్యాకెట్ల 128 కిలోలు ఎండు గంజాయిని గుర్తించారు. దాని విలువ సుమారు రూ. 64 లక్షలు, నిందితులను అదుపులోకి తీసుకొని, వివరాలు అడిగి తెలుసుకొనగా ఒడిశా రాష్ట్రంలోని గజపతి జిల్లాలోని సరఫరాదారు రాజ్ కుమార్ వద్ద నుంచి గంజాయి తెచ్చి, మహారాష్ట్రలోని నాసిక్ జిల్లా, మలేగావ్ ప్రాంతంలో విక్రయిస్తున్నట్లు విచారణలో వెల్లడైంది. పోలీసులు అదుపులోకి తీసుకున్న నిందితులలో ఫిరోజ్ అహ్మద్ కలీమ్ అహ్మద్, మలేగావ్, నాసిక్ జిల్లా, మహారాష్ట్ర, సగర్‌నాయక్(సగర్) గజపతిజిల్లా, ఒడిశా. మెహబూబ్ అబ్దుల్ అహద్ (అంసారీ), మలేగావ్, నాసిక్ జిల్లా, మహారాష్ట్ర రాష్ట్రం, మహ్మద్ ఇర్ఫాన్ మహ్మద్ అక్టమ్(ఇర్ఫాన్), మలేగావ్, నాసిక్ జిల్లా, మహారాష్ట్ర రాష్ట్రం ఉన్నారు. జిల్లాలో మాదక ద్రవ్యాల దుర్వినియోగంపై జిల్లా పోలీసు శాఖ ఉక్కు పాదం మోపడం జరుగుతుందని, ఎవరైనా గంజాయి లేదా ఇతర మాదక ద్రవ్యాలను సాగు, సరఫరా చేసిన 8712656777 నెంబర్ కు సమాచారం అందించాలని జిల్లా ఎస్పీ పారితోష్ పంకజ్ జిల్లా ప్రజలను కోరారు. కేసు చేదనలో కీలకంగా వ్యవహరించిన బిడిఎల్‌భానూర్ ఇన్స్పెక్టర్ విజయ్ కృష్ణ, ఎస్ఐ వెంకటేశం, సంగారెడ్డి జిల్లా ఎస్‌న్యాబ్ ఇన్స్పెక్టర్ నాగేశ్వర్ రావ్ సిబ్బంది, క్లూస్ టీం సిబ్బందిని ఎస్పీ పరితోష్ పంకజ్ అభినందించారు.

## సిఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందచేసిన చైర్మన్

**జహీరాబాద్, ఆగస్టు 17, ప్రభాతవార్త:** నియోజకవర్గానికి చెందిన 11 మందికి ఆదివారం ఆదర్శనగర్ కాలనీలోని కాంగ్రెస్ నాయకులు డాక్టర్ సిద్దం ఉజ్వల్‌రెడ్డి నివాస గృహంలో సిఎంఆర్ఎష్ చెక్కులను అందచేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రాంలింగారెడ్డి, ముబీన్, నర్సింహారెడ్డి, గండారెడ్డి, మంకాల్ సుభాష్, ధనసిరి మల్లికార్జున్‌రెడ్డి, జమిలాలోద్దిన్ తదితరులు పాల్గొన్నారు.

## బిల్డింగ్ పై నుంచి పడి బాలుడు మృతి

**అమీన్‌పూర్, ఆగస్టు 17 ప్రభాతవార్త :** రెండవ అంతస్తు పై నుండి ప్రమాదవశాత్తు బాలుడు పడి మృతిచెందిన ఘటన సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. స్థానికుల సమాచారం ప్రకారం... అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని పటేల్‌గూడా హరి విల్లు టౌన్‌షిలో అద్దెకు ఉండే గురుమూర్తికి ముగ్గురు పిల్లలు. వీరి స్వస్థలం వనపర్తి జిల్లా బలజపల్లి గ్రామం. లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. పెద్దకుమారుడు హర్షవర్ధన్(4) రెండు అంతస్తులో ఆడుకుంటూ కాలుజారి పడడంతో తల పగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. అప్పటి వరకు ఆడుకుంటున్న చిన్నారి మృత్యువాతకు గురవడంతో తల్లి దండ్రుల రోదనలు మిన్నంటాయి. ఎస్ఐ రామాంజనేయులు కేసు నమోదుచేసి మృతదేహాన్ని పటాన్‌చెరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

## కానిస్టేబుల్‌ను దూషించిన ఆటో డ్రైవర్‌పై కేసు

**జహీరాబాద్, ఆగస్టు 17, ప్రభాతవార్త:** తాగిన మైకంలో రోడ్డు నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరించిన ఆటోడ్రైవర్ పోలీసు కానిస్టేబుల్ ను దూషించిన సంఘటన జహీరాబాద్‌లో ఈ నెల 16న జరిగింది. ఎస్ఐ వినయ్‌కుమార్ కథనం ప్రకారం...పట్టణ శివారులోని రంజోల్ గ్రామానికి చెందిన వలియుద్దీన్ (45) తన ఆటోను (టిఎస్ 34 టిఎ 3462)ను ట్రాఫిక్‌కు అంతరాయం కలిగేలా ఆటోను నిలిపి ఉంచడంతో విధుల్లో ఉన్న కానిస్టేబుల్ ఆటో డ్రైవర్‌కు నచ్చచెప్పే యత్నం చేయడం డ్రైవర్ తాగిన మత్తులో (201యంజి-100 మిల్లీ గ్రాముల రీడింగ్) కానిస్టేబుల్‌ను ఆటో తీయను, ఏం చేసుకుంటావో చేసుకో అంటూ వాగ్వివాదాలకు దిగి బూతు మాటలతో దూషించడంతో పాటు ఒంటిపై డీజిల్ పోసుకున్నాడన్నారు. విధులకు ఆటంకం కల్గించిన ఆటో డ్రైవర్‌పై చర్యలు తీసుకోవాలని కానిస్టేబుల్ చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కె వినయ్‌కుమార్ వివరించారు.

## చెక్కును ఢీకొన్న బైక్.. యువకుడు మృతి

**నర్సాపూర్, ఆగస్టు 17, ప్రభాతవార్త:** బైక్ అదుపుతప్పి చెట్టుకు ఢీ కొట్టిన సంఘటనలో ఒక యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన నర్సాపూర్ మెదక్ ప్రధాన రోడ్డులోని రెడ్డిపల్లి సమీపంలో రైస్‌మిల్ వద్ద చోటు చేసుకుంది. ఎస్సై లింగం కథనం ప్రకారం... హైదరాబాద్ లోని మీర్ ఆలంమండికి చెందిన శశాంక్‌నాథ్(27) స్నేహితుడు గుడ్ల ఆదిత్య కలిసి ఈనెల 16వ తేదీన గచ్చిబౌలి నుండి మెదక్ పోచారం డ్యామ్ చూడ్డానికి రెండు బైక్‌లపై వెళ్లారని తెలిపారు. వీరు పోచారం డ్యాం చూసి అనంతరం తిరిగి హైదరాబాద్ వెళుతుండగా రెడ్డిపల్లి గ్రామ సమీపంలో ఉన్న రైస్‌మిల్లు వద్దకు రాగానే శశాంక్‌నాథ్ బైకును అదుపుతప్పి చెట్టుకు ఢీకొన్నాడని తెలిపారు. ఈ ప్రమాదంలో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. కాగా అతడి స్నేహితుడు ఆదిత్యకు శశాంక్ కనపడపోయేసరికి ముందుగానే వెళ్లిపోయాడని అనుకున్నాడు. ఈ క్రమంలో కొందరు పొదల్లో పడిన బైక్ శశాంక్ మృతదేహాన్ని చూసి పోలీసులకు సమాచారం అందించారని తెలిపారు. సమాచారం మేరకు పోలీసులు సంఘటన స్థలాన్ని సందర్శించి శశాంక్‌నాథ్ మృతదేహాన్ని నర్సాపూర్ ప్రభుత్వాసుపత్రిలో మార్చురీ గదిలో భద్రపరిచారు. ఈ సమాచారాన్ని మృతుడి తండ్రి అనిల్ కుమార్ కు తెలియజేయగా వారు వచ్చి చూసినా అనంతరం నర్సాపూర్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. మృతుడి తండ్రి అనిల్ కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై బి. లింగం తెలిపారు

## నర్సాపూర్‌లో స్కూటీ చోరీ

**నర్సాపూర్ ఆగస్టు 17, ప్రభాతవార్త:** పట్టణంలో స్కూటీ చోరీకి గురైన సంఘటన చోటు చేసుకుంది. ఎస్సై బి లింగం కథనం ప్రకారం ఇలా ఉన్నాయి... నర్సాపూర్ పట్టణానికి చెందిన శక్తి ప్రకాష్ ఈ నెల 9న తన సొంత స్కూటీతో నర్సాపూర్ ప్రధాన రోడ్డులో ఉన్న బాలాజీ ఫుడ్ జోన్ టిఫిన్ టీ సెంటర్ వద్దకు వెళ్లి ఆ హోటల్ ముందు స్కూటీని నిలబెట్టి పండ్ల కోసం పండ్ల దుకాణానికి వెళ్లినట్లు తెలిపారు. పండ్లు తీసుకొని వచ్చేవరకు స్కూటీ కనపడ లేదు ఈ మేరకు ఈ స్కూటీని ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారని తెలిపారు ఈ స్కూటీ ప్రకాష్ భార్య గౌతమీ పేరున రిజిస్టర్ అయి ఉందన్నారు. చోరీకి గురైన స్కూటీ సొంతదారు శక్తి ప్రకాష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై బి.లింగం తెలిపారు.

## పేకాటరాయుళ్ల అరెస్ట్

**జహీరాబాద్, ఆగస్టు 17, ప్రభాతవార్త:** మండల పరిధిలోని హోతి (బి) గ్రామంలో పేకాట ఆడుతున్న 8 మందిని అరెస్టు చేసినట్లు రూరల్ ఎస్ఐ ఎం.కాశీనాథ్ తెలిపారు. ఎస్ఐ కథనం ప్రకారం... గ్రామ శివారులోని ఒక రేకుల షెడ్డులో కొందరు జూదం ఆడుతున్నట్లు సమాచారం అందడటతో సిబ్బందితో కలిసి జూద గృహంపై దాడి చేసి 8 మంది పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకుని 55,350 రూపాయలను, 8 మొబైల్ ఫోన్‌లను, 7 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

# సిద్దిపేట జిల్లా కాంగ్రెస్‌లో కయ్యాల గోల..

- మూడు మూఠాలు ఆరు గ్రూపులు..
- మైనంపల్లి వర్సెస్ తూకుంట మధ్య
- జోరుగా సాగుతున్న గ్రూప్ వార్
- అధిష్టానం పట్టించుకోవాలని కోరుతున్న క్యాడర్



**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**

జిల్లా కాంగ్రెస్‌లో కయ్యాల గోలతో...పార్టీ పరిస్థితి మూడు మూఠాలు ఆరు గ్రూపులుగా మారింది. గజ్వేల్, సిద్దిపేట నియోజవర్గాలలో కాంగ్రెస్ కయ్యాల జోరు నడుస్తుండగా దుబ్బాక నియోజకవర్గంలో గ్రూపుల గోల నడుస్తుంది. జిల్లాలో సిద్దిపేట, గజ్వేల్, దుబ్బాక, హుస్నాబాద్ నియోజకవర్గాలు ఉండగా హుస్నాబాద్ మినహాయించి మూడు నియోజకవర్గాల్లో బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఉన్నారు. ఈ మూడు నియోజకవర్గాలలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాల్సిన ఆ పార్టీ నాయకులు కయ్యాలకు కాలు దువ్వుతుండడంతో కిందస్థాయి క్యాడర్ పరిస్థితి విడవుమంటే పాముకు కోపం కరవుమంటే కప్పకు కోపం అన్నట్లు తయారైందని చెప్పక తప్పదు. ప్రధానంగా గజ్వేల్, సిద్దిపేటనియోజకవర్గాలలో మైనంపల్లి హన్మంతరావు, డిసిసి అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి మధ్య గ్రూపు తగదాలు రోజు రోజుకు పెరిగిపోతున్నాయి. దీంతో పార్టీ క్యాడర్ అయోమయానికి గురువుతున్నారు. గజ్వేల్, సిద్దిపేట నియోజకవర్గాలలో ఓ గ్రూపు మైనంపల్లి హన్మంతరావుకు అనుకూలంగా ఉండగా మరో గ్రూపు నర్సారెడ్డికి అనుకూలంగా ఉన్నారు. మైనంపల్లి హన్మంతరావు, నర్సారెడ్డి మధ్య గ్రూపుల గోల పచ్చగడ్డివేస్తే భగ్గుమన్నట్లు మారింది. గజ్వేల్ నియోజకవర్గంలో మార్కెట్ కమిటీ చైర్మన్‌ల నియామకంలో హన్మంతరావు సూచించిన వారికి కాకుండా నర్సారెడ్డి సూచించినవారికి పదవులు దక్కడంతో ఇక్కడ వర్గ పోరు మొదలైంది. ఏకంగా జిల్లా ఇన్‌చార్జి మంత్రి వివేక్‌వెంకటస్వామి ఎదుటే గజ్వేల్ పట్టణంలో జరిగిన అధికారికి కార్యక్రమంలో మైనంపల్లి, నర్సారెడ్డి వర్గీయులు ఒకరిపై ఒకరు పరస్పర దాడులు చేసుకున్న విషయం తెలిసిందే! గొడవలో నర్సారెడ్డి డిసిసి ఎస్సీసెల్ చైర్మన్ విజయ్ కుమార్‌పై దాడి చేసిన సంఘటన పోలీసు స్టేషన్ వరకు వెళ్లింది. నర్సారెడ్డిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలని విజయ్‌కుమార్ ఫిర్యాదు చేయగా నర్సారెడ్డిపై పోలీసులు కేసు నమోదు చేశారు. అధికార కాంగ్రెస్ పార్టీలో జరుగుతున్న గొడవలను చూసి ప్రజలు ఇదేమిటని ముక్కున వేలేసుకుంటే నాయకులు మాత్రం నవ్వితే నవ్విపోదురుగాక మాకేంటి సిగ్గు అన్నట్లుగా వ్యవహారిస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులకు అందించడంతో పాటు అభివృద్ధి పనులను ప్రజలకు వివరించాల్సిందిపోయి కయ్యాలకు కాలుదువ్వుతున్న విషయం పార్టీ అధిష్టానాకి తెలిసిన పట్టించుకోవడం లేదని కార్యకర్తలు ఆవేదన చెందుతున్నారు.

**సిద్దిపేటలోనూ అంతే...**

సిద్దిపేట నియోజకవర్గంలోనూ మైనంపల్లి హన్మంతరావు వర్సెస్ డిసిసి అధ్యక్షులు నర్సారెడ్డిల వర్గపోరు జోరుగానే సాగుతుంది. నియోజకవర్గంలో మూడు గ్రూపులు ఉండగా ఓ గ్రూపుకు చెందిన గాదగోని చక్రధర్ గౌడ్ ఇటీవల మైనంపల్లి తీరుపై అసహనం వెళ్లగక్కి పార్టీకి రాజీనామా చేశారు. దీంతో నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ వర్గం మైనంపల్లి హన్మంతరావు కనుసైగల్లో పనిచేస్తుండగా పార్టీకి చెందిన సీనియర్ నాయకుల్లో చాల మంది డిసిసి అధ్యక్షుడు నర్సారెడ్డి కనుసైగల్లో పనిచేస్తున్నారు. నియోజకవర్గం ఇన్‌చార్జి ఒంటెద్దు పోకడలు ఆయన పనితీరు నచ్చకు చాలా మంది ఆయన వర్గం నుంచి వైదొలిగి నర్సారెడ్డి వర్గంలో చేరుతున్నారు. నియోజకవర్గ ఇన్‌చార్జి హరికృష్ణ వ్యవహారశైలిపై విసుగు చెందిన సీనియర్ నాయకులు ఆయనను మార్చాలని పలుమార్లు పార్టీ అధిష్టానికి సైతం ఫిర్యాదులు చేసినట్లు తెలుస్తుంది. పంద్రాగస్టు వేడుకలను సైతం జిల్లా కేంద్రంలో రెండు గ్రూపులు వేర్వేరుగా నిర్వహించారు. డిసిసి అధ్యక్షుడు నర్సారెడ్డి సీనియర్ నాయకులతో కలిసి డిసిసి కార్యాలయంలో పంద్రాగస్టు వేడుకలు నిర్వహించగా నియోజకవర్గ ఇన్‌చార్జి హరికృష్ణ తాను ఏర్పాటు చేసుకున్న క్యాంపు కార్యాలయంలో తన అనుచరులతో కలిసి పంద్రాగస్టు వేడుకలు నిర్వహించారు. సిద్దిపేట నియోజకవర్గంలో సైతం హన్మంతరావు, నర్సారెడ్డి గ్రూపుల గోల రోజు రోజుకు పెరిగిపోతుంది. జిల్లాలో గ్రూపుల గోల ఇలాగే ఉంటే త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీకి తీరని నష్టం జరుగుతుందని ఆ పార్టీ క్యాడర్ చర్చించుకుంది. పార్టీ అధిష్టానం కలుగజేసుకోని గ్రూపులకు పులిస్టాప్ పెట్టకపోతే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీకి పరభవం తప్పదని స్వయన ఆ పార్టీ శ్రేణులే చర్చించుకుంటున్నారు. దుబ్బాక నియోజకవర్గంలో సైతం గ్రూపులకు కళ్లెం వేయాలని పార్టీ శ్రేణులు కోరుతున్నారు. మైనంపల్లి హన్మంతరావు, తూకుంట నర్సారెడ్డిల గ్రూపులకు కళ్లెం వేయాల్సిన బాధ్యత పార్టీ అధిష్టానంపై ఎంతైనా ఉందని పార్టీ శ్రేణులు అంటున్నారు. ఇద్దరి గ్రూపు తగదాలకు చెక్‌పెట్టకుంటే పార్టీ పరిస్థితి మరింత దిగజారుతుంని పార్టీ శ్రేణులు అంటున్నారు. కాగా ఇప్పటికే ఆయా నియోజకవర్గాలలో నామినేటెడ్ పోస్టులు భర్తీ చేయడం లేదని పార్టీ సీనియర్ నాయకులు కస్సు బుస్సు మంటున్నారు.

